
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



సోమశిలలో 64.150 టీఎంసీలు
జలాశయంలో బుధవారానికి 64.150 టీఎంసీలు ఉన్నాయి. 21,710 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1350, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.1,09,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.9,810
3 శాతం జీఎస్టీతో	రూ.10,104
సవర (8 గ్రా)	రూ.80,832

గరిష్టం/కనిష్టం
35.4 /27.3

వాతావరణం
జిల్లాలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. బుధవారం గాలిలో తేమ 57 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పన్ను చెల్లించని వాహనాలపై కేసులు


రవాణా కార్యాలయంలో సీజ్ చేసిన వాహనాలు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు (టౌన్): నెలల తరబడి జిల్లాలో తిరుగుతూ ఎలాంటి లైఫ్‌ట్యాక్స్‌లు చెల్లించని కార్లపై రవాణా అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి పన్నులు చెల్లించని ఇతర రాష్ట్రాల వాహనాలపై గత నెల 28న 'సాక్షి'లో 'అడిగేదెవరు.. ఆపేదెవరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి రవాణాశాఖాధికారులు స్పందించారు. ఎంవీఐ బాలమురళి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా జీవిత పన్ను చెల్లించని ఇతర రాష్ట్రాలకు చెందిన 15కు పైగా కార్లు, ఇతర వాహనాలపై కేసుల నమోదు చేసి సీజ్ చేశారు. ఆర్టీఓ మదాని మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు జిల్లాలో తిరగాలంటే ఆ వాహనానికి సంబంధించి జీవిత పన్ను చెల్లించాలన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు


కారుణ్య నియామకపు పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తూ మరణించిన ఇద్దరు కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఆఫీస్ సబార్డినేట్లుగా ఉద్యోగావకాశాలు కల్పించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు అందించారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

నెల్లూరు (పొగతోట): జిల్లాలోని గ్రామ పంచాయతీలకు రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని డీపీఓ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 722 పంచాయతీల్లో నాలుగు పంచాయతీకు జరగలేదు. 718 పంచాయతీలకు రూ. 40,82,23,462 నిధులు విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత నిధులు విడుదల కాని 65 గ్రామ పంచాయతీలకు రూ.1,90,78,952 నిధులు విడుదల చేశారు. మొత్తం 718 గ్రామ పంచాయతీలకు రూ.42,73,02,414 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేశారు.

ముగ్గురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

నెల్లూరు (టౌన్): జిల్లా నుంచి అత్యుత్తమ సేవలు అందించిన ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. బుచ్చి మండలం పెనుబల్లి ఎంపీపీఎస్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ సీహెచ్ చెన్నయ్య, ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ ప్రభుత్వ హైస్కూల్ ప్లస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) కె. డొమనిక్‌రెడ్డి, ఇందుకూరుపేట మండలం నరసాపురంలోని ఎంవీఆర్‌ఆర్ జెడ్పీహైస్కూల్ అసిస్టెంట్ (పీడీ) ఎస్‌కే ముజీర్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అమరావతిలో సీఎం చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు.

9న హెచ్‌ఐవీపై అవగాహన మారథాన్

నెల్లూరు (అర్బన్): హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 9న 5 కి.మీ. పరుగు (మారథాన్) నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, స్పోర్ట్స్ అథారిటీ, రెడ్‌రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు 17- 25 ఏళ్లలోపు విద్యార్థులు, మగ, ఆడ, ట్రాన్స్‌జెండర్ విభాగాల్లో విడివిడిగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రంలోపు 86394 32458 నంబర్‌కు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ నెల 9న ఏసీ స్టేడియం వద్దకు తమ ఐడీ కార్డుతో హాజరు కావాలని కోరారు. విజేతలకు అన్ని విభాగాల్లో మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7 వేలు నగదు బహుమతి ఇస్తామన్నారు. విజేతల ఎంపిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నిర్ణయిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి మారథాన్ పోటీకి అర్హులవుతారన్నారు.

కరకట్ట ముప్పు.. కానరా ముంపు


2021 నవంబరు 21న పెన్నానదికి వచ్చిన భారీ వరదతో నీట మునిగిన నెల్లూరులోని భగత్‌సింగ్‌కాలనీ (ఫైల్)


పడుగుపాడు వద్ద కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్ (ఫైల్)


కొట్టుకుపోయిన చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి (ఫైల్)


రైల్వే ట్రాక్‌ను తాకుతూ ప్రమాద స్థాయిలో పెన్నానది (ఫైల్)

సోమశిలకు కృష్ణా వరద జలాలు
- నిండుకుండగా మారితే పెన్నానదిలోకి వదలాల్సిన పరిస్థితి
- రాబోయే మూడు నెలల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- పరీవాహక ప్రాంతాల్లో ఆక్రమణలు
- మరో వైపు విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు
- ఇంకో వైపు 11 మండలాల్లో నది కరకట్ట తవ్వేసి రోడ్లు
- ఒక్కసారిగా లక్షల క్యూసెక్కుల వరద వదిలితే తీరంలోని గ్రామాలకు ముంపు తప్పదు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వర్షాకాలం వస్తుందంటే పెన్నా నదీ పరీవాహక ప్రాంత గ్రామాల్లో నివాసాలు ఉండే ప్రజలకు వణుకు పుడుతోంది. సోమశిల జలాశయం ఎగువ భాగంలో వర్షం కురిస్తే వరద పోటెత్తితే.. దిగువ పెన్నానదికి వదలాల్సిన అనివార్య పరిస్థితి ఉంటుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు విస్తారంగా వర్షాలు కురిశాయి. ఏటా పెన్నానది ప్రమాదకర స్థాయిలో ఉరకలెత్తింది. తాజాగా జిల్లాతోపాటు రాయలసీమ జిల్లాల్లో ఎక్కడా వర్షం లేకపోయినా.. కృష్ణానదికి ఎగువ నుంచి వరద రావడంతో సోమశిలకు వరప్రదాయనిగా మారింది. జలాశయంలో బుధవారం నాటికి 64.150 టీఎంసీలు ఉండగా, పైతట్టు ప్రాంతాల నుంచి 21,710 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమశిల పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలు.. ప్రస్తుతం జలాశయానికి రోజుకు రెండు టీఎంసీలు వరకు వరద జలాలు వస్తుండగా, మరో జలాశయానికి ఒక టీఎంసీపైగా విడుదల చేస్తున్నారు. ఇదే స్థాయిలో వరద కొనసాగితే.. మరో పది రోజుల్లో వరద నీటిని దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి ఉంటుంది.

రాబోయే మూడు నెలలే కీలకం

దక్షిణ కోస్తాతోపాటు రాయలసీమ జిల్లాల్లో రాబోయే మూడు నెలల్లోనే భారీ వర్షాలు కురిసే సీజన్. ఇప్పటికే సోమశిల నిండుకుండగా మారిన నేపథ్యంలో ఈ సీజన్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిస్తే ఒక్కసారిగా పెన్నానదికి జలాశయం నుంచి లక్షల క్యూసెక్కుల వరద వదలాల్సిన పరిస్థితి తప్పదు. ఈ నేపథ్యంలో పెన్నా పరీవాహక ప్రాంతం నీట మునిగి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశాలు మెండుగా ఉన్నాయని తీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2021లో సోమశిల నిండుకుండగా ఉన్న సమయంలో రాయలసీమ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసి అక్కడ డ్యామ్ తెగిపోవడంతో జలాశయానికి వరద పోటెత్తింది. దీంతో ఒక్కసారిగా 3.90 లక్షల క్యూసెక్కుల నుంచి 5 లక్షల క్యూసెక్కుల నీటిని పెన్నానదిలోకి వదిలారు.

జిల్లాలో పెన్నానది పొడవు	-108 కి.మీ
నదీతీరంలో ఉన్న మండలాలు	-11
గ్రామాలు	58

తీర గ్రామాలను ముంచెత్తిన వరద

ఊహించని విధంగా పెన్నానదికి వరద పోటెత్తడంతో రాత్రికి రాత్రే తీరగ్రామాలను వరద ముంచెత్తింది. దశాబ్దాల చరిత్రలో కనీవినీ ఎరుగుని విధంగా దామరమడుగు, పాటూరు, కోవూరుతోపాటు నెల్లూరులోని వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్‌కాలనీలో జలప్రళయంలో చిక్కుకున్నాయి. పడుగుపాడు వద్ద రైల్వే ట్రాక్ కొట్టుకుపోతే.. దిగువన ఉన్న చెన్నై-కోల్‌కత్తా హైవే సైతం కొట్టుకుపోయింది. ఇలాంటి విపత్తును ఎన్నడూ చూసి ఉండలేదు.

కానరా.. కనువిప్పు

గతంలో 2015 అక్టోబరు, 2021 నవంబరులో ఆనాటి జలప్రళయ విధ్వంసం అంతా ఇంతా కాదు. అది తలుచుకుంటే అందరిని భయాందోళన వణికిస్తోంది. అప్పట్లో పరీవాహక ప్రాంతాల్లో ఉండే గ్రామాలు నీట మునగడంతోపాటు చేతి కంది వచ్చే పంటలు నీటి పాలయ్యాయి. సీజన్ అంతా కష్టపడి పెట్టుబడులు పెట్టుకొని చేతికందే దశలో నీటిపాలు చేసింది. నీట మునిగిన గ్రామాల్లో పొయ్యి కూడా వెలిగించుకోలే దుస్థితి నెలకొంది. సంగం మండలం వీర్లగుడిపాడు, కోలగట్ల, కోవూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. పడవల సాయంతో జిల్లా యంత్రాంగం ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టి గ్రామ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసింది. ముంపు గ్రామాల పరిస్థితి చూసి జిల్లా అధికారులు చలించిపోయారు. నగరంలోని పొర్లుకట్ట ప్రాంతంలోని జయలలితనగర్, వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్‌కాలనీ, ఇస్లాంపేట జనార్దన్‌రెడ్డి కాలనీ ముంపు బారిన పడి కట్టుబట్టలతో మిగిలిపోయారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానం నిజం కాబోతున్నదా?.. అంటే ప్రస్తుత పరిస్థితులు, రాబోయే పరిణామాలు అవుననే స్పష్టం చేస్తున్నాయి. పెన్నానదీ పక్కనే ఉన్న గ్రామాలతోపాటు నెల్లూరుకు బుడమేరు విపత్తుకు మించిన పెను ముప్పు పొంచి ఉందని జలవనరుల అధికారులు, పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లలో జలప్రళయం సృష్టించిన విలయం, పెన్నానది నుంచి విరుచుకుపడిన వరద ముంపును చూసినా.. అధికార, పాలక యంత్రాంగానికి కనువిప్పు కలగకపోవడం దురదృష్టకరం. ఇప్పటికే సోమశిల నిండుకుండగా మారింది. రాబోయే మూడు నెలల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పెన్నాతీరానికి జలగండం పొంచి ఉంది.

ప్రమాదకరంగా పొర్లుకట్టలు

గతంలో రెండు పర్యాయాలు వరద విపత్తును ఎదుర్కొన్న పరీవాహక ప్రాంత వాసులు వర్షాకాలం వస్తుందంటే వణికిపోతున్నారు. ఇందుకు కారణం పెన్నానది ప్రవాహాన్ని అడ్డుకొనే రక్షణ కట్టలు (పొర్లుకట్టలు) ధ్వంసం కావడమే. కొందరు స్వార్థపరులు ఇసుక కోసం, భూములు ఆక్రమణ కోసం చేసిన తప్పిదాలు పరీవాహక ప్రాంత ప్రజలకు శాపంలా మారింది. సోమశిల నుంచి దిగువ నుంచి పెన్నానది దాదాపు 108 కిలోమీటర్ల పొడవున 11 మండలాల పరిధిలో 58 గ్రామాల ప్రవహిస్తోంది. నదీ ప్రవాహం పక్కకు రాకుండా వరద ప్రవాహాన్ని నియంత్రించే విధంగా పొర్లు కట్టలు ఏర్పాటు చేశారు. సోమశిల జలాశయం నిండినప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిని నదిలోకి విడుదల చేస్తారు. ఆ సమయంలో నదీ ప్రవాహం పొంగి ప్రవహిస్తోంది, ఆ ప్రవాహాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన పొర్లుకట్టలు ఇప్పటికే కరిగిపోయి ఎత్తుతగ్గాయి. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా ఇసుకాసురులు ఇసుకను తరలించేందుకు అనంతసాగరం నుంచి ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం, చేజర్ల, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, పొట్టేపాళెం, దామరమడుగు, కోవూరు, సాలుచింతల, విడవలూరు, పల్లిపాడు ప్రాంతాల్లో ఉన్న పొర్లుకట్టలు ఆనవాళ్లు కూడా లేకుండా చేశారు. తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ధిక్కరించి పర్యావరణాన్ని ధిక్కరించి ఊరూరా పెన్నానది పొర్లుకట్టలు ధ్వంసం చేసి రహదారులు ఏర్పాటు చేశారు. దాదాపు 60 శాతం పొర్లుకట్టలు మాయమైపోయాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ధిక్కరించి లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వేశారు. ఈ పరిస్థితుల్లో సోమశిల జలాశయం నిండి నీటిని నదిలోకి వదిలితే పరీవాహక ప్రాంతంలో ఉన్న గ్రామాలతోపాటు నెల్లూరు నగరానికి పెను ముప్పు తప్పదని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

కూటమి అరాచకాలకు చరమగీతం పాడుదాం

- ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం
- రైతులను ఉద్దేశించి మంత్రి అచ్చెన్నాయుడు వ్యంగ్యంగా మాట్లాడడం సమంజసం కాదు
- వచ్చే ఎన్నికల్లో రామ్‌కుమార్‌రెడ్డి అత్యధిక మెజార్టీ ఖాయం
- ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రాపూరు/సైదాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు రాష్ట్ర ప్రజలు విసిగి వేసారి పోతున్నారని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కూటమిని కూకటి వేళ్లతో సహ పెకిలించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాపూరులోని బత్తిన పట్టాభిరామిరెడ్డి నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో కాకాణి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులు పెట్టడంలో కూటమి ప్రభుత్వం కుట్రలు పతాక స్థాయికి చేరాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అరాచకాలకు చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. 1995 నాటి సీఎంను ప్రజలకు చూపిస్తామని మాట్లాడుతున్న చంద్రబాబు, గతంలో కూడా కూతురినిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి అధికారం దక్కించుకున్నారని గుర్తుచేశారు. ఆ తరహాలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వెన్నుపోటు పొడుస్తున్నారని దుయ్యబట్టారు. వయసు మీద పడుతున్నా.. గతంలో చేసిన అరాచక పాలనే సాగిస్తున్నారని ఆరోపించారు. యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో ఇబ్బందులు పడుతుంటే ఆ సమస్యను పరిష్కరించాల్సిన ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అవహేళనగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రైతులకు ఉసురు కూటమి ప్రభుత్వానికి తప్పని సరిగా తగులుతుందన్నారు. ఎంతో రాజకీయ అనువభం ఉన్న నేదురుమల్లి కుటుంబం నుంచి వారసుడు రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. 2027లో జమిలీ ఎన్నికలు రావడం ఖాయమని, రామ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుపించుకునేందుకు వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గతంలో వెంకటగిరి అభివృద్ధికి దివంగత మాజీ ముఖ్యమంత్రి జనార్దన్‌రెడ్డి సతీమణి, మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఎన్నో శాశ్వతమైన పనులు చేపట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయన తనయుడు రామ్‌కుమార్‌రెడ్డి అదే తరహాలో అభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారని తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి వెంకటగిరి నుంచే గెలుపు ఆరంభమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

30లోపు ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు (టౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఆర్.బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు www. bse. ap. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. డిసెంబరు 7న పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఎంపీయూపీ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న సంవత్సర ఆదాయం రూ.3.5 లక్షల లోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, బీసీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకుపై వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

33 బార్లకు రీనోటిఫికేషన్

- 14వ తేదీ సాయంత్రం 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 15న కలెక్టర్ సమక్షంలో లాటరీ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 33 బార్లకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాసులునాయుడు బుధవారం రీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తులు స్వీకరణ, 15న కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి లైసెన్సులు మంజూరు చేస్తామని చెప్పారు.

గత నెలలో..

జిల్లాలో గత నెలలో ఓపెన్ కేటగిరీ కింద 50, గీత కులాలకు సంబంధించి 5 బార్లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ దాఖలు చేశారు. అయితే 55 బార్లకు 21 బార్లకు 94 దరఖాస్తులు దాఖలయ్యాయి. గత నెల 30న జేసీ కె.కార్తీక్ లక్కీడిప్ నిర్వహించి కేటాయించారు. కందుకూరు మున్సిపాలిటీలో గెజిట్ సీరియల్ నెంబర్ 47 బార్‌కు ఒక్క దరఖాస్తు దాఖలు కావడంతో అదే రోజు ఎక్సైజ్ అధికారులు మరో నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 2వ తేదీ ఆ బార్‌కు లాటరీ నిర్వహించారు.

రీ నోటిఫికేషన్ బార్లు ఇవే..

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గెజిట్ సీరియల్ నంబర్ 1, 2, 3, 5, 8, 10, 13, 14, 15, 17, 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27, 31, 32, 33, 34, 37, 38, కావలి మున్సిపాలిటీలో 39, 40, 41, 43, 44, ఆత్మకూరు మున్సిపాల్టీలో 49, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో 50 బార్లతోపాటుగా అల్లూరు నగర పంచాయతీలోని గెజిట్ సీరియల్ నంబర్ 5వ బార్‌కు అధికారులు రీనోటిఫికేషన్ చేశారు.

జలవనరుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

- కలెక్టర్ ఆనంద్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ (రిపేర్, రెన్నోవేషన్, రెస్టోరేషన్) స్కీం ద్వారా జిల్లాలో జలవనరులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాల్లో జరిగిన జిల్లా స్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పంటలకు నీటిని సమృద్ధిగా అందించేందుకు, నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాలు పెంచడమే ఆర్‌ఆర్‌ఆర్ స్కీం ప్రధాన లక్ష్యమని చెప్పారు. డ్వామా, భూగర్భ జల, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ పథకం కింద రూ.35,519.56 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన జిల్లాలోని 220 మైనర్ ఇరిగేషన్ చెరువులను క్షుణ్ణంగా పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. తద్వారా సుమారు 26,928 హెక్టార్ల ఆయకట్టు అభివృద్ధిలోకి వస్తుందని చెప్పారు. చెరువులను అభివృద్ధి చేసిన తర్వాత ఉపాధి హామీ పథకం ద్వారా ప్లాంటేషన్, వాకింగ్ ట్రాక్ మొదలైన పనులను చేపట్టాలని డ్వామా పీడీకి సూచించారు. గ్రౌండ్ వాటర్ అధికారులు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించాలన్నారు. తొలుత ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్ ఆర్‌ఆర్‌ఆర్ స్కీం ద్వారా చేపట్టాల్సిన చెరువులు, కాలువలు, చెక్‌డ్యామ్‌ల బలోపేతం, మరమ్మతు పనులు చేపట్టడం, నీటిపారుదల అవకాశాలను మెరుగు పరచడానికి చేపట్టాల్సిన చర్యలను కమిటీకి వివరించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ భూగర్భ జల విభాగం శాస్త్రవేత్త పెరిక యాదయ్య, డ్వామా పీడీ గంగాభవాని, భూగర్భ జల డిప్యూటీ డైరెక్టర్ శోభన్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయభాస్కర్, ఇరిగేషన్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

238 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యం డంప్ వద్ద అధికారులు

సోమశిల: అనంతసాగరం మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా విచ్చలవిడిగా జరుగుతోంది. గత నెల మొదటి వారంలోనే అక్రమంగా తరలిస్తూ కోవూరు సమీపంలో 950 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నెల ప్రారంభమై రెండు రోజులు గడవక ముందే బుధవారం ఇసుగలూరు గ్రామానికి సమీపంలోని ఓ తోటలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారని అధికారులు, మీడియాకు గ్రామస్తులు సమాచారమివ్వడంతో రెవెన్యూ, సివిల్ సప్లయ్స్, పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టారు. తోటలోని ఓ రేకులషెడ్, రెండు ట్రాక్టర్ల ట్రంకులో 238 బస్తాల బియ్యం ఉండటాన్ని అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్స్ డీటీ అజీజ్ మాట్లాడారు. బియ్యం అక్రమ నిల్వలు ఉన్నాయనే సమాచారంతో దాడులు చేసి సరుకును సీజ్ చేశామన్నారు. ఈ బియ్యాన్ని ఆత్మకూరు ఎమ్మెల్ఎస్ పాయింట్‌కు తరలిస్తామని వెల్లడించారు. తహసీల్దార్ జయవర్ధన్, ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వెంకటాచలం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కాకుటూరు వద్ద గల వీఎస్‌యూలో అధ్యాపకులకు క్రీడా పోటీలను బుధవారం రెండో రోజూ నిర్వహించారు. పోటీలను వీసీ అల్లం శ్రీనివాసరావు ప్రారంభించారు. వాలీబాల్, 100 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, డిస్క్ త్రో.. మహిళాధ్యాపకులకు 100 మీటర్ల స్పీడ్ వాకింగ్ పోటీలను నిర్వహించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆగని దందా..

చెరువుల్లో జోరుగా గ్రావెల్ తవ్వకాలు

సంపూర్ణ సహకారం అందిస్తున్న ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారి


కరేడు చెరువులో ఇటీవల జరిపిన మట్టి తవ్వకాలు


గుడ్లూరు పెద్ద చెరువులో ఇలా..

కందుకూరు: నియోజకవర్గంలోని ఇరిగేషన్ చెరువుల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు ఏ మాత్రం అడ్డుకట్ట పడటంలేదు. ఇరిగేషన్ అధికారుల అండదండలు అక్రమార్కులకు పుష్కలంగా లభిస్తుండటంతో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. చెరువులను లక్ష్యంగా చేసుకొని తవ్వకాలకు భారీగా పాల్పడుతున్నారు.

తీరుమార్చుకోని ఉన్నతాధికారి..

పట్టపగలు దౌర్జన్యంగా సాగుతున్న ఈ దందాలో ఇరిగేషన్ శాఖలోని ఓ ఉన్నతాధికారి పాత్రపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్నాయి. ఆయనే వెనుకుండి ఈ దందాను కొంతకాలంగా నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి ఇప్పటి వరకు ఒక్కసారి సైతం అడ్డుకోకపోవడం ఈ ఆరోపణలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. తవ్వకాలు జరిగే ప్రదేశాలకు తన కింది స్థాయి సిబ్బంది సైతం వెళ్లకుండా నియంత్రిస్తున్నారని, తనకు చెప్పకుండా ఏ చెరువు వద్దకెళ్లేందుకు వీల్లేదంటూ హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. ప్రతిఫలంగా మాఫియా నుంచి ముడుపులు భారీగా ముడుతున్నాయనే అంశం ఆ శాఖ సిబ్బందిలో చర్చనీయాంశంగా మారింది.

పట్టపగలు.. జోరుగా

గుడ్లూరులోని పెద్దచెరువు నుంచి గ్రావెల్ తవ్వకాలను సోమవారం పట్టపగలు భారీగా చేపట్టారు. ఒక జేసీబీ, 20 ట్రాక్టర్లను ఏర్పాటు చేసి తమ తంతును సాగించారు. ఆపై గుడ్లూరులోని ఓ లేఅవుట్‌కు తరలించారు. చెమిడిదిపాడు పరిధిలోని దూదాలచెరువు నుంచీ ఇదే తరహాలో వ్యవహరించారు. తవ్వకాల వెనుక అధికార పార్టీకి చెందిన నేతలు కీలకంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రావెల్ అవసరమైన ప్రైవేట్ వ్యక్తులతో ఒప్పందాలు చేసుకోవడం.. తదుపరి స్థానికంగా ఉండే చెరువుల నుంచి అక్రమంగా కొల్లగొట్టి తరలించడం పరిపాటిగా మారింది.

సమాచారమిచ్చారంటూ ఫిర్యాదులు

తాను గ్రావెల్ తవ్వకాలకు సహకరిస్తున్నా.. తన శాఖలోని కొందరు సిబ్బంది సమాచారాన్ని బయటకు చెప్పడంతో పాటు విలేకరులకూ తెలియజేస్తున్నారంటూ వారిపై స్థానిక ప్రజాప్రతినిధి వద్దకెళ్లి ఫిర్యాదులు చేస్తున్నారని సమాచారం. అధికార పార్టీ నేతల అండదండలు మెండుగా ఉండటంతో తనకు ఎదురేలేదనే రీతిలో అక్రమ సంపాదనకు ఇరిగేషన్ చెరువులను ఆదాయ వనరుగా మలుచుకున్నారు. చెరువుల్లో భారీ ఎత్తున గుంతలను యంత్రాలతో తీసి గుల్ల చేస్తున్నా, సదరు అధికారి అడ్డుకోకపోగా, వ్యతిరేకించే కింది స్థాయి సిబ్బందిని సైతం బెదిరిస్తున్నారని సమాచారం.

అనుమతులా.. అబ్బే..!

రోడ్డు నిర్మాణం కోసం ఉలవపాడు మండలంలోని కరేడు చెరువు నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి తరలించారు. వాస్తవానికి సాగునీటి చెరువుల్లో తవ్వకాలను సాగించాలంటే ఆ శాఖ అధికారుల నుంచి అనుమతులను విధిగా పొందాలి. క్యూబిక్ మీటర్ మేరకు ధరను నిర్ణయించి ఆపై తవ్వుకునేందుకు అనుమతులను మంజూరు చేస్తారు. అయితే నియోజకవర్గంలో ఇలాంటివేవీ జరగడంలేదు. చెరువులను అధికార పార్టీ నేతలు తమ చేతుల్లోకి తీసుకొని భారీ ఎత్తున తవ్వకాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా, సాగునీటి శాఖ.. రెవెన్యూ అధికారులు గానీ ఆవైపు కన్నెత్తి చూసే సాహసం చేయడంలేదు.

- సర్వేపల్లిలో బరితెగించిన కూటమి నేతలు
- పాపాలను కప్పిపుచ్చుకునేందుకు విశ్వప్రయత్నాలు

గ్రావెల్‌ను కొల్లగొట్టి.. చెత్తతో గుంతలు నింపుతూ


నింపిన చెత్తను చదును చేస్తున్న జేసీబీ


గుంతల్లో నింపేందుకు ఉంచిన చెత్త వ్యర్థాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సర్వేపల్లి నియోజకవర్గంలో ఆ పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా దోపిడీకి తెగబడ్డారు. ప్రభుత్వ భూములనే లక్ష్యంగా చేసుకొని కోట్లాది రూపాయల విలువజేసే గ్రావెల్ సంపదను కొల్లగొట్టి సొమ్ము చేసుకున్నారు. వారి ధనదాహానికి సజీవ సాక్ష్యాలుగా మిగిలిన ఈ గుంతలను మాయం చేసేందుకు నెల్లూరులోని చెత్తనంతా తరలిస్తున్నారు.

అడ్డుకున్నా.. బెదిరించి

వెంకటాచలం మండలం సర్వేపల్లిలో కోట్లాది రూపాయల విలువజేసే 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది నెలల్లో వీటిపై కూటమి నేతల కన్ను పడింది. భూముల్లో విలువైన గ్రావెల్ ఉందని తెలిసిన వెంటనే, ఎలాంటి అనుమతుల్లేకుండా తరలించారు. తమకు ఇళ్ల పట్టాలిచ్చేందుకు ఈ భూములను కేటాయించారంటూ గిరిజన కుటుంబాల్లోని పలువురు అప్పట్లోనే వెళ్లి అడ్డుకున్నా, నిర్వాహకులు బెదిరించి వారిని వెళ్లగొట్టారు. ఇక్కడ 10 నుంచి 15 అడుగుల లోతులో గ్రావెల్‌ను తవ్వి నెల్లూరులోని పలు లేఅవుట్లకు తరలించారు. టిప్పర్‌లో మట్టిని రూ.12 వేల నుంచి రూ.15 వేల చొప్పున విక్రయించారు. తవ్వకాలను ఐదు నెలల పాటు సాగించి, నిత్యం వందలాది టిప్పర్లలో తమ పనిని కానిచ్చారు. ఈ రకంగా వ్యవహరించినా భూగర్భ గనుల శాఖ, పోలీస్, రెవెన్యూ, అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు.

చెత్తతో నింపే పనిలో నిమగ్నం

గ్రావెల్ గుంతలను పూడ్చేందుకు గానూ నెల్లూరులోని చెత్తాచెదారాలు, వ్యర్థాలను ఇక్కడికి తీసుకొస్తున్నారు. సర్వేపల్లిలో గ్రావెల్ గుంతలు సజీవ సాక్ష్యాలుగా ఉంటే, తాము ఇరుక్కునే ప్రమాదం ఉందనే ఆలోచనతో కూటమి నేతలు ప్రస్తుతం ఇలా వ్యవహరిస్తున్నారు. చెత్తాచెదారాలను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీని ద్వారా వచ్చే దుర్గంధంతో స్థానికులు నానా అవస్థ పడుతున్నారు. ఈ విషయమై టిప్పర్ల డ్రైవర్లతో గ్రామస్తులు మాట్లాడినా, వారు ఏ మాత్రం లెక్కచేయడంలేదు. అధికారులు పట్టించుకోకపోవడంపై వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టేకు చెట్లు నరికి.. తరలించింది టీడీపీ నేతలే


మాట్లాడుతున్న రాజేశ్వరమ్మ

పొదలకూరు: తన పొలంలో రూ.కోటి విలువైన టేకు చెట్లను టీడీపీ నేతలు అక్రమంగా నరికించి తరలించారని బీజేపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి రాజేశ్వరమ్మ ఆరోపించారు. మండలంలోని మరుపూరు సమీపంలో గల రాజేశ్వరమ్మ పొలంలో అక్రమంగా నరికిన టేకు చెట్లను బలిజ సంఘం, బీజేపీ నేతలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. పొదలకూరుకు చెందిన టీడీపీ నేత యశ్వంత్‌రెడ్డి, మురళి, అనిల్‌కుమార్‌రెడ్డి కలిసి తన పొలంలో టేకు చెట్లను అక్రమంగా నరికించి అక్కడే విక్రయించారని మరుపూరుకు చెందిన ఆ పార్టీ నేతలే పేర్లతో సహా వెల్లడించారని పేర్కొన్నారు. పొదలకూరు పోలీస్‌స్టేషన్లో గత నెల 26న తాను లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయాన్ని ముందుగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. అయితే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లొద్దని, పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టాలని ఆయన సూచించారని చెప్పారు. కేసు పెట్టక ముందు, ఆపైన సుమారు 12 రోజులుగా అందరి వద్దకెళ్లినా ప్రయోజనం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరగకపోతే చలో అమరావతిని చేపట్టి సీఎంకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి దాసరి సురేంద్రబాబు, బలిజ సంఘ నేత పామూరు కృష్ణయ్య,, పార్టీ నేతలు చొప్పా వెంకటేశ్వర్లు, గురుస్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిమజ్జనంలో అపశ్రుతి

- బీచ్‌లో మునిగి యువకుడి మృతి

మనుబోలు: వినాయక విగ్రహ నిమజ్జనానికెళ్లి బీచ్‌లో మునిగి యువకుడు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. పిడూరు మిక్స్‌డ్ కాలనీలో గణేశ్ మండపాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిమజ్జనం నిమిత్తం కోట మండలం శ్రీనివాసస్త్రం బీచ్‌కు విగ్రహాన్ని తీసుకెళ్లారు. ఈ తరుణంలో నన్నం రామయ్య, మంగమ్మ కుమారుడు జశ్వంత్‌కుమార్ అలల తాకిడికి సముద్రంలో మునిగిపోయారు. స్నేహితులు ఒడ్డుకు చేర్చగా, అప్పటికే ఆయన మృతి చెందారు. జశ్వంత్ మృతితో పిడూరు మిక్స్‌డ్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాగేందుకు డబ్బులివ్వలేదని బ్లేడ్‌తో దాడి

నెల్లూరు(క్రైమ్): తాగేందుకు డబ్బులివ్వలేదనే అక్కసుతో ఇద్దరిపై గుర్తుతెలియని వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేసి గాయపర్చిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురానికి చెందిన వలీ, నవాబుపేటకు చెందిన హరిప్రసాద్ స్నేహితులు. చిన్న పనులు చేసుకొని వీరు జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో పూలే విగ్రహం వద్ద వీరు మూడు రోజుల క్రితం మాట్లాడుకుంటుండగా, గుర్తుతెలియని వ్యక్తి వచ్చారు. తాగేందుకు డబ్బులివ్వాలని, లేకపోతే అంతుచూస్తానని బెదిరించారు. లేవని చెప్పడంతో తన వద్ద ఉన్న బ్లేడ్‌తో వలీ, హరిప్రసాద్‌పై దాడి చేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాపురానికి భార్య రాలేదనే మనస్తాపంతో..

- వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు సిటీ: కాపురానికి భార్య రావడంలేదనే మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కల్లూరుపల్లి ఇందిరమ్మ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీకి చెందిన నరసింహ(35)కు నాయుడుపేటకు చెందిన అలివేలుతో పదేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి నలుగురు పిల్లలున్నారు. గ్యాస్ స్టౌలను రిపేర్ చేస్తూ కుటుంబాన్ని పోషించసాగారు. మనస్పర్థల నేపథ్యంలో తన పిల్లలతో కలిసి పుట్టింటికి నాలుగేళ్ల క్రితం ఆమె వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న ఆయన పలుమార్లు తిరిగి రావాలని భార్యను ప్రాధేయపడినా ఆమె నిరాకరించారు. తాజాగా మంగళవారం మరోసారి ఫోన్ చేసి రావాలని కోరగా, ఆమేమీ చెప్పకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయాన్ని సోదరి బుధవారం గుర్తించి.. నెల్లూరు రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి వారు చేరుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వేణు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యో.. కన్నా

- స్కూల్‌కెళ్లేందుకు బ్యాగ్ సర్దుకుంటూ..
- బాల్కనీ నుంచి కిందపడి బాలుడి మృతి

నెల్లూరు(క్రైమ్): అంత వరకు ఉత్సాహంగా గడిపి.. పాఠశాలకెళ్లేందుకు సిద్ధమయ్యాడు. బాల్కనీలో బ్యాగ్ సర్దుతూ.. ప్రమాదవశాత్తూ కిందపడటంతో బాలుడు మృతి చెందిన హృదయ విదారక ఘటన నెల్లూరు రూరల్ మండలం విజయలక్ష్మీనగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఈ హఠాత్పరిణామాన్ని జీర్ణించుకోలేని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసుల సమాచారం మేరకు.. విజయలక్ష్మీనగర్‌లోని గాయత్రి నిలయం రెండో అంతస్తులో నివాసం ఉంటున్న రాజు, సుమతి దంపతులకు వంశీకృష్ణ (15), మహేంద్ర సంతానం. సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో వంశీకృష్ణ పదో తరగతి చదువుతున్నాడు. ఈ తరుణంలో స్కూల్‌కు వెళ్లేందుకు బాల్కనీలో బ్యాగ్‌ను సర్దుకుంటుండగా, ప్రమాదవశాత్తూ కాలుజారి కింద మట్టి రోడ్డుపై పడ్డాడు. గమనించిన వాచ్‌మెన్.. రాజుకు తెలియజేయడంతో ఆయన కిందకొచ్చి అపస్మారక స్థితిలో ఉన్న కుమారుడ్ని చికిత్స నిమిత్తం కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులు రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

భుజం నొప్పికి ప్రత్యేక స్క్రీనింగ్


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): భుజం నొప్పితో దీర్ఘకాలంగా బాధపడుతున్న వారి కోసం నగరంలోని అపోలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షల ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చామని హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. రోబోటిక్ ఆర్థోప్లాస్టీ సర్జన్ వివేకానంద రెడ్డి, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ డాక్టర్ శశిధర్ రెడ్డి, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ విక్రమ్‌రెడ్డితో కలిసి ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీరామ్‌సతీష్ మాట్లాడారు. రూ.999కే డాక్టర్ల కన్సల్టేషన్‌తో పాటు ఆర్బీఎస్, సీబీసీ, యూరిక్ యాసిడ్ సీరమ్ క్రియాటినిన్, ఎక్స్‌రే – షోల్డర్, సీస్పైన్ పరీక్షలను నిర్వహించనున్నామని, ఈ ప్రత్యేక ప్యాకేజీ అక్టోబర్ 31 వరకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. తొలుత బ్రోచర్లను ఆవిష్కరించారు. యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ఎగురవేసి.. వీడియోలు చిత్రీకరించి

- మాజీ వలంటీర్ రుక్మిణి ఆవేదన
- న్యాయం చేయాలని అభ్యర్థన

సాక్షి, టాస్క్‌ఫోర్స్: బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని ఇస్కపాళెం పంచాయతీ వడ్డిపాళెంలో నివాసం ఉంటున్న మాజీ వలంటీర్ రుక్మిణి ఇంటిపై డ్రోన్‌ను కొందరు వ్యక్తులు సోమవారం ఉదయం ఎగురవేసి వీడియోలు చిత్రీకరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు.. తన తల్లిదండ్రులు, అక్క, ఆమె కుమార్తెలు ఇంట్లో ఉండగా, డ్రోన్ ఎగురవేయడాన్ని గమనించామని చెప్పారు. వెంటనే బయట కొచ్చి చూడగా, ఓ వ్యక్తి రిమోట్ కంట్రోల్‌తో డ్రోన్‌ను ఆపరేట్ చేస్తుండటాన్ని గుర్తించామని వివరించారు. ఆ సమయంలో తన అక్క కుమార్తె స్నానం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న వ్యక్తిని గ్రామానికి చెందిన జనార్దన్‌గా గుర్తించామన్నారు. దీనిపై ప్రశ్నించగా.. రామకృష్ణ, శంకరయ్య చెప్తే తాను వీడియోలు తీస్తున్నానని తెలిపారన్నారు. ఈ విషయమై 112కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీ శ్రీనివాసులుకు విషయాన్ని మంగళవారం తెలియజేయగా, ఆయన ఆదేశాలతో బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్లో నిందితులపై ఫిర్యాదు చేశామన్నారు. గతంలోనూ వీరు తమ కుటుంబాన్ని అనేక ఇబ్బందులకు గురిచేశారని, ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్:	రూ.110
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.226
లేయర్ చికెన్:	రూ.210

